సాక్షి వికారాబాద్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



ప్రసవానికి వచ్చి..

కాన్పు కోసం వచ్చిన గర్భిణి మృతి చెందిన ఘటన సోమవారం తాండూరు మాతాశిశు కేంద్రంలో చోటుచేసుకుంది. 10లో▸



అరెస్టులతో ఆపలేరు

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. 10లో▸



వాహనదారులకు శాపం

నత్తతో పోటీ పడుతున్న పనులతో కొడంగల్ నియోజకవర్గ ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 11లో▸

దేవీ శరన్నవరాత్రులు



శైలపుత్రి అలంకరణలో దుర్గామాత



తాండూరు రూరల్: ఐనెల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొమ్మిది రోజుల పాటు దుర్గమ్మ వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం శైల పుత్రి రూపంలో దర్శనమిచ్చారు. వికారాబాద్ సమీపంలోని శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభస్వామి దేవస్థానంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ పద్మనాభం ధ్వజారోహణం చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

– అనంతగిరి



దసరా వేడుకలను ప్రారంభిస్తున్న ఆలయ ట్రస్టీ చైర్మన్ పద్మనాభం

న్యూస్‌రీల్

భూ సేకరణ పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

అనంతగిరి: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం నగరం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హార్ష్ చౌదరి, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కి 158 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మంగీలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు తిరుమల ప్రసాదం

అందజేసిన సంజీవ్‌కుమార్



బంట్వారం: ప్రముఖ బిల్డర్ బంట్వారం వాసి మొగ్దుంపురం సంజీవ్‌కుమార్ సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి తిరుమల లడ్డూ ప్రసాదం అందజేశారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న టీఆర్‌ఆర్



పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామిని సోమవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అవే వెతలు!

యూరియా కోసం తప్పని తిప్పలు

ఎల్మకన్నె సొసైటీ కార్యాలయం ఎదుట బారులు తీరిన రైతులు

ఒక్క బస్తా మాత్రమే అందజేత



ఎల్మకన్నె సొసైటీ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

తాండూరు రూరల్: అన్నదాతలకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. ఓ వైపు పొలాల్లో పని చేసుకుంటూ.. మరోవైపు యూరియా కోసం కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని ఎల్మకన్నె సొసైటీ కార్యాలయం వద్దకు ఆయా గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు కార్యాలయానికి చేరుకొని రైతులను సముదాయించారు. క్యూలో ఉన్న వారికి సొసైటీ సీఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది టోకెన్లు పంపిణీ చేశారు. 450 బస్తాల యూరియా రావడంతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా సరఫరా చేశారు. మధ్యాహ్నం వరకు క్యూలో ఉన్న రైతులకు సరఫరా చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్ ఎఫ్‌పీసీఎస్ కార్యాలయం వద్ద రైతులు క్యూలో చెప్పులు ఉంచారు. తెల్లవారుజామున 4 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు రైతులతో మాట్లాడి పరిస్థితిని వివరించి క్యూలో నిలబెట్టారు. కార్యాలయ సిబ్బంది పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని టోకెన్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత యూరియా సరఫరా చేశారు. పంటలకు సరిపడా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



పెద్దేముల్ ఎఫ్‌పీసీఎస్ కార్యాలయం వద్ద చెప్పుల క్యూ

కుండపోత వర్షం



కొడంగల్: పట్టణ శివారులో నీట మునిగిన కంది పంట

- అలుగు పారుతున్న చెరువులు, కుంటలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు
- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు



దుద్యాల్: ఆలేడ్‌లో నీటి మునిగిన పత్తి పంట

కొడంగల్: జిల్లాలోని పలు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా పడింది. కొడంగల్ మండలంలో 5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మండలంలోని ర్యాలపేట చెరువుకు గండి పడింది. ఇరిగేషన్ అధికారులు గండిని పూడ్చారు. దుద్యాల్ మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు అలుగు పారుతున్నాయి. దౌల్తాబాద్ మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

చేవెళ్ల ఎంపీ, జీఎస్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: జీఎస్టీ సంస్కరణలు దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయని, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పేదలు, రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందని చేవెళ్ల ఎంపీ, జీఎస్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై వికారాబాద్‌లోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తగ్గిన జీఎస్టీతో ప్రజలకు కొనుగోలు సామర్థ్యం పెరుగుతుందన్నారు. వస్తు వినియోగ పన్ను తగ్గింపు అంశం ప్రజల్లోకి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని మీడియాను కోరారు. జీఎస్టీ తగ్గింపును వ్యక్తిగత, రాజకీయ కోణాల్లో కాకుండా ప్రజాప్రయోజనాల అంశంగా పరిగణించాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. కొన్ని శక్తులు దేశాన్ని విభజించేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. జీఎస్టీ అంశాన్ని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

వారికోసమే అలైన్‌మెంట్ మార్పు

బడా బాబుల భూములను కాపాడేందుకే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని ఎంపీ కొండా ఆరోపించారు. ప్రస్తుత ప్లాన్‌లో పేద, మధ్య తరగతి రైతుల భూములే పోతున్నట్లు తెలుస్తోందన్నారు. ట్రిపుల్ ఆర్ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మాత్రమే ఇస్తుందని, భూసేకరణ, అలైన్‌మెంట్ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టంచేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్ని పనులూ తానే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

జిల్లా అధ్యక్షుడికి చేదు అనుభవం

ఇదిలా ఉండగా ప్రెస్‌మీట్ చివరి దశలో అక్కడికి వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి సాధారణ కార్యకర్తలా సమావేశంలో కూర్చున్నారు. ప్రెస్ మీట్ అనంతరం బయటకు వచ్చేశారు. అదే గదిలో కూర్చున్న ఎంపీ ప్రెస్‌మీట్ తర్వాత డోర్ పెట్టేసి పార్టీ నాయకులతో మాట్లాడారు. డోర్ తీసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన జిల్లా అధ్యక్షుడికి మీరు అక్కడే వెయిట్ చేయండి అని సూచించారు. సమావేశం అనంతరం ఎంపీతో మాట్లేందుకు ప్రయత్నించినా నేను తిరుపతి వెళ్తున్నా, ఫ్లైట్ టైమ్ అయిపోతుందంటూ కారులో హైదరాబాద్ బయల్దేరారు. ఈ సమావేశంలో జీఎస్టీ జిల్లా ప్రచారక్ ఈశ్వరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, రమేశ్‌కుమార్, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, సీనియర్ నాయకులు వడ్లనందు, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, నందు, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పాట ఆవిష్కరణ



బతుకమ్మ పాటను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబ్‌పేట: ఎమ్మెల్యే కాలె యాదయ్య స్వగ్రామం చించల్‌పేటలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 'తారాజువ్వా.. తంగేడు పువ్వా' అనే బతుకమ్మ పాట – 2025 రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం గ్రామంలో బతుకమ్మ పాట సీడీని ఆవిష్కరించారు. అంజిలప్ప రచించిన పాటను గాయని మమతా రమేశ్ పాడారని చెప్పారు. ఈ నెల 29న నిర్వహించే సామూహిక బతుకమ్మ సంబరాలు, వీడియో సాంగ్ చిత్రీకరణకు జోగు శ్యామలాదేవి, గాయని మమతా రమేశ్, సీనియర్ జానపద కళాకారుడు అశోక్ మాస్టర్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. బతుకమ్మ సంబరాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కాలె జయమ్మ, మాజీ ఎంపీపీ భవాని, గేయ రచయిత, గాయకుడు అంజిలప్ప, జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుతో అధిక ఆదాయం



రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ రాజరత్నం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం

కొడంగల్ రూరల్: వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడంతోపాటు నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దనందిగామ గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబ్లె ఆయిల్స్ – ఆయిల్స్ సీడ్స్(ఎన్‌ఎంఈఓ–ఓఎస్) పథకం కింద రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూనె గింజల ఉత్పత్తి పెరగడం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. సాగు పద్ధతులను పాటిస్తూ సమయానికి విత్తుకోవాలని, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, మండల వ్యవసాయాధికారి జి.తులసీ, ఏఈఓలు అశ్విని, సుమ, రాజు, ఐసాక్ హెరాల్డ్, శ్రీపతి, మాజీ సర్పంచు సంజీవరెడ్డి, రైతులు సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులు రద్దు చేయండి

కందుకూరు: స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌ను తొలగించి కొత్తవారిని నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలో డీసీఓ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్ చంద్రశేఖర్‌పై తప్పుడు అభియోగాలు మోపుతూ, ఎలాంటి విచారణ చేపట్టకుండా తొలగించి, కొత్తగా వెంకట్రామ్‌రెడ్డిని ఏకపక్షంగా నియమించడం సరికాదన్నారు. ఉత్తర్వులను రద్దు చేసి పాత చైర్మన్‌నే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తొలగించిన చైర్మన్ డి.చంద్రశేఖర్, సభ్యులు జి.విజేందర్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నరసింహ, జి.పర్వతాలు, జి.అంజమ్మ, జి.వెంకటేశ్, కె.యశోద, ఎం.చంద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న హైవే విస్తరణ

వాహనాల రాకపోకలకు అంతరాయం



ఐనెల్లి వంతెన వద్ద నిలిచిన వాహనాలు

తాండూరు రూరల్: మండల పరిధి అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా తాండూరు– చించోళి మార్గంలోని ఐనెల్లి గ్రామ సమీపంలో ఉన్న వంతెనను సంబంధిత అధికారులు.. ఇటాచీ, జేసీబీ సహాయంతో తొలగింపు పనులు కొనసాగిస్తున్నారు. దీంతో ఐనెల్లి బ్రిడ్జికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నిర్మాణ పనుల నేపథ్యంలో.. పక్కనే డైవర్షన్ రోడ్డును నిర్మించారు. తాండూరు నుంచి చించోళి వెళ్లే వాహనాలు.. ఆ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయి.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ. చిత్రంలో నిందితుడు వెంకటి

తాండూరు టౌన్: మహిళ హత్య కేసులో నిందితున్ని రిమాండ్‌కు తరలించామని పట్టణ సీఐ సంతోష్ కుమార్ సోమవారం తెలిపారు. పట్టణంలోని మల్లప్పమడిగ వద్ద ఆదివారం పట్టపగలు మాంసం విక్రయించే పిచ్చకుంట్ల పద్మమ్మ(60).. మేనల్లుడు వెంకటి చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు నిందితుడు హత్యకు ఉపయోగించిన గొడ్డలితో పాటు, మృతిరాలి మెడలో నుంచి అపహరించిన 4.2 తులాల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై హత్యానేరం, దొంగతనం కేసు నమోదు, చేసి రిమాండ్‌కు తరలించారు.

దిగబడిన ట్రాక్టర్



ఒకవైపు ఒరిగిన ట్రాక్టర్

కొడంగల్ రూరల్: తాండూర్ నుంచి కోస్గి వైపు ఫీటు రాయి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్.. మండల పరిధి పర్సాపూర్ బస్టాఫ్ సమీపంలో సోమవారం మట్టిలో కూరుకుపోయింది. దీనిని రోడ్డు పనులు చేస్తున్న వారు గమనించి, ఇటాచీ సహాయంతో వాహనాన్ని వెలుపలకు తీశారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి



నేతలకు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం వడ్డెర సంఘం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నాయకులు పలువురు.. వడ్డెర భవనం నిర్మించాలని కోరుతూ వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కులగణన చేసి, ఏ వర్గానికి ఎంతశాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రణాళికతో ఉందని పేర్కొన్నారు. శేఖర్, రాములు, కృష్ణయ్య, వెంకటయ్య, జనార్దన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి పరామర్శ



సుశాంత్‌కు అందుతున్న వైద్యంపై డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

తాండూరు టౌన్: చెట్టు కొమ్మ తలపై విరిగిపడి ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి సుశాంత్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం నగరంలోని ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సుశాంత్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందుతుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు గడ్డల రవీందర్, రాజేందర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.



కొడంగల్: కోతకు గురైన హుస్నేన్‌పూర్ రోడ్డు



దౌల్తాబాద్: చింతల్ చెరువు దాటుతున్న రైతులు



దౌల్తాబాద్: ప్రవహిస్తున్న సుల్తాన్‌పూర్ వాగు

దంచికొట్టి.. దడపుట్టించి

వరుణుడి కుండపోతకు పల్లెలు, పట్టణాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. ఏకధాటి వర్షాలతో వాగులు వంకలు జల ప్రవాహంతో ఉరకలెత్తుతున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగి, రైతన్నకు నష్టాన్ని మిగిల్చాయి. రహదారులు, కల్వర్టులు దెబ్బతిని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

వరుణుడి బీభత్సం.. రాత్రికిరాత్రే అతలాకుతలం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- అలుగుపోస్తున్న చెరువులు, కుంటలు
- నీటమునిగిన పంటపొలాలు, దెబ్బతిన్న రోడ్లు
- స్తంభించిన రవాణా, అస్తవ్యస్తంగా జనజీవనం



కొడంగల్ : ఉధృతంగా అలుగు పారుతున్న పెద్ద నందిగామ చెరువు

కొడంగల్/కొడంగల్ రూరల్/దుద్యాల్/ దౌల్తాబాద్: జిల్లాలోని పలు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా పడింది. కొడంగల్ మండలంలో 5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. హుస్నేన్‌పూర్ రోడ్డు వరద ఉధృతికి కోసుకు పోయింది. పర్సాపూర్‌లో ప్రధాన రహదారిపై బురదలో వాహనాలు దిగబడ్డాయి. అంగడిరాయిచూర్ వాగు జోరుగా ప్రవహిస్తోంది. కొడంగల్ బైపాస్ నిర్మాణం కోసం వేసిన మట్టి వర్షం దాటికి కొట్టుకొని పోయింది. మండలంలోని ర్యాలపేట చెరువుకు గండి పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు గండిని పూడ్చడానికి ప్రయత్నించారు. ఇరిగేషన్ అధికారులు గండిని పూడ్చారు. దుద్యాల్ మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు ఆలుగు పారుతున్నాయి. కుదురుమల్ల గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మాణం కోసం తెచ్చిన ఇటాచీ, కాంక్రీట్ మిక్సింగ్ మిషన్ నీటి మధ్యలో ఇరుక్కుపోయాయి. దుద్యాల్ గేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ చుట్టూ నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దౌల్తాబాద్ మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చాలా గ్రామాల్లో బీటీ రోడ్లు ధ్వంసమయ్యాయి. మట్టి రోడ్లు కోసుకుపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇండాపూర్ – కుదురుమళ్ల మధ్య వాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు స్తంభించాయి. గుముడాల – బిచ్చాల రోడ్డు ధ్వంసమైంది. దేశాయిపల్లి, దౌల్తాబాద్ గ్రామాల మధ్య ఉన్న చింతల్ చెరువు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యాంకి గ్రామంలో చెరువు కింద పంటలు నీట మునిగి పోవడంతో రైతులు నష్టపోయారు.



కొడంగల్ రూరల్: ర్యాలపేట చెరువుకు పడిన గండిని పూడ్చిన అధికారులు



దుద్యాల్: కుదురుమల్ల వాగులో ఇరుక్కుపోయిన ఇటాచీ వాహనం

సాల్వీడు చెరువుకు గండి

కుల్కచర్ల: ప్రస్తుత వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వానకు మండల పరిధి సాల్వీడు గ్రామ చెరువుకు గండి పడింది. దీంతో అప్రమత్తమైన గ్రామస్తులు మట్టిని పోసి గండిని పూడ్చారు. నీటి ప్రవాహాన్ని ఆపారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.



చెరువుకు మరమ్మతు చేస్తున్న గ్రామస్తులు

జనావాసాలు.. జలమయం



ఇంజాపూర్- తొర్రూర్ రోడ్డుపై వరద ప్రవాహం

తుర్కయంజాల్: రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సాయంత్రం మొదలు రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. 7.5 సె.మి. వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి పలు ప్రాంతాల్లో 10 సె.మి. వర్షం కురిసింది. దీంతో తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు వరద పోటెత్తింది. అక్కడి నుంచి నుంచి ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువుకు నీరు ప్రవహించే వాగు జలప్రవాహానికి ఆపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీలు నీటిలో తేలియాడాయి. సోమవారం సాయంత్రం భారీ వర్షం పడగా.. రెండు ఫీట్లకు పైగా నీరు అపార్ట్‌మెంట్లలో చేరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో గడిపారు.

వద్దన్నా వినకుండా..

ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే మార్గంలో సుమారు 200 ఫీట్ల వెడల్పుతో నీరు ప్రవహిస్తుండటంతో.. అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అడ్డుగా రాళ్లను పెట్టించారు. ఇది లెక్కచేయని బైరమాల్‌గూడకు చెందిన ముగ్గురు యువకులు.. వరదలో కారును ముందుకు పోనిచ్చారు. ప్రవాహం పెరగడంతో కారు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు తగిలించి నిలిపారు. అతి కష్టం మీద, మున్సిపల్ సిబ్బంది సహకారంతో ముగ్గురు యువకులను బయటకు రప్పించారు.



ఆదిబట్లలో ట్రాఫిక్ జామ్

చెరువులు కావు.. రహదారులు

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్నంలోని సంతోష్ థియేటర్ ఎదుట, ఆదిబట్ల టీసీఎస్ రోడ్డు చెరువును తలపించాయి.

బైక్‌ను ఢీకొట్టి.. ముప్పతిప్పలు పెట్టి

- కారులో పరారైన ఇద్దరు వ్యక్తులు
- పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- గ్రామస్తులపై ఠాణాలో బాధితుల ఫిర్యాదు

చేవెళ్ల: కారుతో బైక్‌ను ఢీకొట్టి.. మూడు గ్రామాల ప్రజలను ముప్పుతిప్పలు పెట్టి, పారిపోతున్న ఇద్దరు వ్యక్తులను వెంబడించి పట్టుకున్నారు. దాడిచేసి, కారును ధ్వంసం చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధి రావుపల్లి గ్రామానికి చెందిన చాకలి రాజు.. బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ఫాంహౌస్‌కు వచ్చిన ఎండీ హస్మతుల్లాఖాన్, ఎండీ నవాజ్ అలీఖాన్‌లు తిరిగి ఇన్నోవా కారులో నగరానికి వెళ్తూ యువకుడి బైక్‌ను ఢీకొట్టారు. అనంతరం కారును ఆపకుండా వెళ్తుండటంతో గమనించిన స్థానికులు.. ముడిమ్యాల గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో వారు కారును ఆపటానికి యత్నించినా, తప్పించుకొని అతి వేగంతో కుమ్మెర వైపు వెళ్లారు. దీంతో ముడిమ్యాల గ్రామస్తులు.. కుమ్మెర గ్రామస్తులకు విషయం తెలపగా.. వారు కారును అడ్డుకున్నారు. మూడు గ్రామాల వారు ఏకమయ్యారు. జరిగిన సంఘటన గురించి కారులోని వ్యక్తులను ప్రశ్నించగా.. సదరు వ్యక్తులు గ్రామస్తులపై తిరగబడ్డారు. దీంతో ఆగ్రహించిన ఆయా గ్రామాల ప్రజలు.. కారును ధ్వంసం చేశారు. ఇద్దరిని చితకబాదారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వ్యక్తులు.. జరిగిన సంఘటనను వివరిస్తూ గ్రామస్తులపై చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మాట్లాడారు. ఎవరైనా తప్పు చేసినా, రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారు పారిపోతున్నా.. వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించాలే కానీ.. దాడి చేయరాదని సూచించారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

సీఐ నాగరాజుగౌడ్

హయత్‌నగర్: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజుగౌడ్ హెచ్చరించారు. సోమవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మానసికంగా వేధించడం తగదని సూచించారు. కొత్తగా వచ్చే వారి పట్ల సోదర భావంతో మెలగాలని, కలిసిమెలసి చదువుకోవాలని చెప్పారు. క్రమశిక్షణ పట్టుదలతో విద్యనభ్యసించి, భవిష్యత్తును చక్కదిద్దుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే.. జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒక్కసారి శిక్ష అనుభవిస్తే.. అది జీవితాంతం వెంటాడుతుందని, జీవితం అంధకారం అవుతుందని వివరించారు. కళాశాలలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులు



అఖిల్ యాదవ్

కొడంగల్: పట్టణానికి చెందిన ఏపీ అఖిల్ యాదవ్ నీట్‌లో మెరుగైన ర్యాంక్ సాధించి ఉచితంగా ఎంబీబీఎస్ సీటు పొందారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షలో 469 మార్కులు వచ్చాయి. దీంతో కాళోజీ నారాయణ రావ్ యూనివర్సిటీ నిర్వహించిన కౌన్సెలింగ్‌లో హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. సోమవారం హైదరాబాద్ వెళ్లి మెడికల్ కాలేజీలో జాయిన్ అయినట్లు అఖిల్ యాదవ్ తండ్రి ఏపీ పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అఖిల్ యాదవ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మెడికల్ సీటు సాధించినట్లు చెప్పాడు. భవిష్యత్తులో వైద్య వృత్తిలో స్థిరపడి రోగులకు సేవ చేయనున్నట్లు తెలిపారు. అఖిల్ యాదవ్‌కు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి శ్రీ కిషన్ రావ్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కత్తి ప్రభాకర్, కొడంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు చామంతి ప్రభాకర్, కానుకుర్తి రమేష్, రాకేష్ యాదవ్, పకీరప్ప, నరేందర్, గోపాల్, బొంకురు నరేష్, గడ్డం రాచయ్య అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన ఆదిత్యవర్ధన్



ఆదిత్యవర్ధన్‌ను అభినందిస్తున్న సునీతారెడ్డి

తాండూరు: యాలాల మండలం బండమీదిపల్లికి పద్మ నర్సింహులు దంపతుల కుమారుడు ఆదిత్యవర్ధన్ నీట్ ప్రవేశ పరీక్షలో సత్తాచాటి ఎంబీబీఎస్ సీటు సాధించారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ గురుకులాల్లోనే చదువుకున్నాడు. నీట్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు దక్కించుకున్నారు. తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు. ఈ విషయం తెలుసుకున్న శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అభినందించారు. విద్యార్థిని శాలువాతో సన్మానించారు.

ప్రసవానికి వచ్చి.. ప్రాణం కోల్పోయి..

- మాతా శిశు ఆస్పత్రిలో గర్భిణి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



అఖిల (ఫైల్)



ఎంసీహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు



గర్భిణి మృతిపై విచారణ చేస్తున్న రాష్ట్ర వైద్య బృంద సభ్యులు

తాండూరు టౌన్: కాన్పు కోసం వచ్చిన గర్భిణి మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రావులపల్లికి చెందిన అఖిల(23)ను రెండో కాన్పు కోసం వారి కుటుంబీకులు ఆదివారం అర్ధరాత్రి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సోమవారం ఉదయం 6 గంటలకు డాక్టర్ మంజుల వారికి సూచించారు. ఆ తరువాత కొద్దిసేపటికే కడుపులో బిడ్డతో పాటు అఖిల మృతి చెందింది. దీంతో బంధువులు ఎంసీహెచ్ ఎదుట ఆందోళనకు దిగారు. రాత్రంతా బాగానే ఉందని చెప్పిన వైద్య సిబ్బంది, తెల్లవారగానే పరిస్థితి విషమంగా ఉందని, మరో దవాఖానకు తీసుకెళ్లాలని చెప్పడం, కొద్దిసేపటికే గర్భిణి చనిపోవడానికి కారణం వైద్య సిబ్బందే కారణమని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ సోమశేఖర్ మాట్లాడుతూ.. ఎంసీహెచ్‌లో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని, అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. గర్భిణి మృతిపై విచారణ చేసి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గైనకాలజిస్ట్‌పై వేటు

కాన్పు కోసం మాతాశిశు ఆస్పత్రికి వచ్చిన గర్భిణి మృతిపై రాష్ట్ర వైద్య విచారణ బృందం సభ్యులు సోమవారం రాత్రి వరకు విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన గైనకాలజిస్ట్ డాక్టర్ మంజులను విధుల నుంచి తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి రావులపల్లికి చెందిన అఖిల.. కాన్పు నిమిత్తం తాండూరులోని మాతాశిశు ఆస్పత్రికి వచ్చి సోమవారం ఉదయం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో రాష్ట్ర విచారణ బృంద సభ్యులు నేషనల్ హెల్త్ మిషన్ గైనకాజిస్ట్ డాక్టర్ సుమిత్ర, మెడికల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, అనస్తీషియన్ డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గర్భిణి ఎంసీహెచ్‌కు వచ్చిన సమయం నుంచి ఆమె మృతి వరకు జరిగిన విషయాలపై సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కడుపులో శిశువు మృతి చెందడం, అధిక రక్తస్రావం వల్ల ఆమె మృతి చెంది ఉంటుందని విచారణ బృంద సభ్యులు తెలిపారు. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత ఎంసీహెచ్‌కు గర్భిణి రాగా డ్యూటీ డాక్టర్ మంజుల తెల్లవారుజామున 5గంటలకు ఆస్పత్రికి వచ్చి ఆమెను పరీక్షించడాన్ని బృంద సభ్యులు తప్పుబట్టారు. విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆమెను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్



పోలీసులు అదుపులో జీవీఎస్ నాయకులు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. సోమవారం గిరిజన సంఘాల చలో హైదరాబాద్ పిలుపు మేరకు.. పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రాద్ధాంతం చేస్తున్న నాయకుల తీరుకు నిరసనగా గిరిజనులు ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఐక్యంగా ప్రభుత్వ తీరుకు నిరసనగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని చూస్తే దేశవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కుట్రకు పాల్పడుతున్న సోయం బాపురావు, తెల్లం వెంకట్రావులను కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బలరాం నాయక్, మండల అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పని యూరియా తిప్పలు

తెల్లవారు జాము 4గంటలకే క్యూలైన్లో రైతులు

నందిగామ: యూరియా కోసం అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. రేయింబవళ్లు పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. చెప్పులు, రాళ్లు క్యూలైన్లో పెట్టి నిరీక్షిస్తున్నారు. మండల పరిధి చేగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం యూరియా వస్తుందనే సమాచారంతో పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తెల్లవారు జామున 4 గంటలకు కేంద్రం వద్ద బారులు తీరారు. అనంతరం లారీలో 450 బస్తాల యూరియా వచ్చింది. పోలీసుల సహకారంతో నిర్వాహకులు పంపిణీ చేశారు. చాలా మందికి యూరియా అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తూ.. నిరాశతో వెనుతిరిగారు.

అన్నదాతకు అండగా నిలుస్తాం

బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి



చైర్మన్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం సభ్యులు

బషీరాబాద్: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అన్నదాతలకు అండగా నిలుస్తుందని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన పాలకవర్గం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రైతులు పండించిన ధాన్యానికి మంచి ధర కల్పించడంతో పాటు మార్కెటింగ్ చేసేందుకు తోడుగా నిలుస్తుందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచేలా రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా, ఇతర రాష్ట్రాల్లో పర్యటనకు పాలకవర్గానికి అనుమతి లభించిందన్నారు. ఆఫీసులో ఫర్నిచర్ కొనుగోలుకు రూ.2 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మాధవరెడ్డిని పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, హన్మంతు, మోహన్, నరేష్, నరేష్ రాథోడ్, సత్యానందం, మునీర్, పాండురంగం, నరేష్ మర్పల్లి, పెంటప్ప, వనమాల, సెక్రటరీ సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.